క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



మోటార్ సైకిల్ ఢీకొని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి కురెళ్ళ పాలుకు తీవ్ర గాయాలు

ఆకివీడు: వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ నాయకుడు జిల్లా కార్యదర్శి కురెళ్ళ పాలు మంగళవారం రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలకు గురయ్యారు. ఆకివీడు నుంచి పుట్టేరు వైపు స్కూటీపై వెళుతున్న పాలుకు ఎదురుగా అతివేగంగా వస్తున్న ద్విచక్ర వహనం బలంగా ఢీకొట్టింది. రోడ్డుపై పడిపోయిన ఆయనకు తలపై మోకాలుపై తొడపై తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆయనను 108 వాహనంలో భీమవరంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. సంఘటనలో ఎదురుగా వచ్చిన ద్విచక్రవాహనదారుడికి కూడా గాయాలయ్యాయి.

రుచికరమైన భోజనాలను వండాలి



మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈవోలు

అత్తిలి: ప్రభుత్వం రూపొందించిన మెనూ ప్రకారం పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం మరింత రుచికరంగా తయారు చేయాలని ఎంఈవో -2 ఎంవీఎల్‌కే ప్రసాద్ తెలిపారు. స్థానిక ఎంపీయూపీ బాలుర పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు మంగళవారం ఒక రోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. మాస్టర్ ట్రైనీ బీకే సత్యవతి, రిసోర్సుపర్సన్‌గా ఎ అప్పలరాజు వ్యవహరించారు. మండల విద్యాశాఖాధికారి ఎస్ రమేష్ మధ్యాహ్న భోజన మెనూ వీడియోలను చూపించి వంట ఎలా చేయాలో తెలిపారు. ఈ సందర్భంగా వంట ఏజన్సీల వారికి వంటల పోటీలు నిర్వహించారు. ఈపోటీలలో ప్రథమ బహుమతి వై అనిత, ద్వితీయ బహుమతి పి వెంకటలక్ష్మి, తృతీయ బహుమతి ఎం నాగలక్ష్మి పొందారు.

సీనియర్ సిటిజన్స్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

తణుకు అర్బన్: సజ్జాపురం సీనియర్స్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. స్థానిక రాష్ట్రపతి రోడ్డులోని అసోసియేషన్ భవనంలో శిబిరానికి హాజరైన 28 మంది వృద్ధులకు డాక్టర్ భూపతిరాజు రమేష్‌చంద్రబాబు వైద్యసేవలు అందజేశారు. ఈ సందర్భంగా బీపీ, సుగర్ పరీక్షలు నిర్వహించి రిపోర్టులు అందజేశారు. వైద్యసలహాల అనంతరం పేద వృద్ధులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అద్దాల సత్యనారాయణ, సజ్జాపురం అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఈదర ప్రసాదరావు, కోసూరి గాంధీ, సభ్యులు ఇవటూరి లక్ష్మణరావు, చేబ్రోలు సాధు, వృద్ధులు పాల్గొన్నారు.

అపారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలో డ్రెయినేజీల ఆక్రమణ వలన పలు ప్రాంతాలు కొద్దిపాటి వర్షానికే నీట మునిగిపోతున్నాయని మునిసిపల్ కమిషనర్ విజయసారధి అన్నారు. మంగళవారం డ్రెయినేజీల్లో సిల్ట్ తీసే కార్యక్రమం మొదలుపెట్టారు. కమిషనర్ విజయసారధి మాట్లాడుతూ చిన్నపాటి వర్షానికే బస్టాండ్ సెంటర్లో నీరు నిల్వ ఉండిపోతుందని, అపారిశుధ్యం తలెత్తకుండా తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ముందుగా బస్టాండ్ వెనుక ఉన్న డ్రెయినేజీలో సిల్ట్ తీయిస్తున్నామని తద్వారా మురుగునీరు పారుదల వేగంగా ఉంటుందన్నారు. పట్టణ ప్రజలకు పారిశుధ్యం ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ప్రధాన మురుగు బోదుల్లో ప్రక్షాళన చేపట్టామన్నారు.

వైఎస్సార్ సీపీ విజయం ఖాయం

యలమంచిలి: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత ఐదేళ్లుగా నవరత్నాల పేరిట అమలు చేసిన సంక్షేమ పథకాలే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని మళ్లీ అధికారంలోకి తీసుకువస్తున్నాయని ఆ పార్టీ పాలకొల్లు నియోజకవర్గ జేసీఎస్ బూత్ ఇన్‌చార్జి ఉచ్చుల స్టాలిన్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దళిత, బడుగు, బలహీన, మైనారిటీ వర్గాల ప్రజలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వెంట ఉన్నారని, జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా చూడాలని ఉవ్విళ్లూరుతున్నారన్నారు. కూటమి అధికారంలోకి వస్తుందనే భ్రమలో ఆ నాయకులున్నారని, వారి భ్రమలన్నీ జూన్ 4న పటాపంచలు అవుతాయన్నారు. ఓట్ల లెక్కింపు సమయంలో అల్లర్లు జరగకుండా ఎన్నికల కమిషన్ కఠిన ఆంక్షలు విధించాలని స్టాలిన్ కోరారు. జూన్ 9న విశాఖపట్నంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండవ సారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడం ఖాయమన్నారు.

కలుషితంగా యనమదుర్రు డ్రెయిన్



యనమదుర్రు డ్రెయిన్‌లో వ్యర్థ జలాలను కలిపేందుకు యనమదుర్రు వద్ద పైపులైన్ వేస్తున్న ఆక్వా పరిశ్రమ యాజమాన్యం (ఫైల్)



కలుషితమైన యనమదుర్రు డ్రెయిన్‌లో స్నానం చేస్తున్న దిగువ గ్రామస్తులు (ఫైల్)

- అన్ని వ్యర్థాలు డ్రెయిన్‌లోనే
- పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ఆక్వా పరిశ్రమలు
- వ్యర్థాలను డ్రెయిన్‌లోకి విడుదల చేస్తున్న వైనం
- తరచూ రోగాల బారిన తీర ప్రాంత గ్రామస్తులు

భీమవరం అర్బన్: యనమదుర్రు డ్రెయిన్ ఒకప్పుడు జీవనదిగా వెలుగొందింది. మూడు దశాబ్దాల క్రితం యనమదుర్రు డ్రెయిన్‌లోని నీటిని తాగునీటిగాను, ఇంటి వాడకానికి ఈ ప్రాంత ప్రజలు వాడేవారు. పూర్వీకులు గోస్తనీ నది జలాలుగా ప్రత్యేక పూజలు నిర్వహించేవారమని చెబుతున్నారు. అలాంటి యనమదుర్రు డ్రెయిన్‌లోకి నేడు అన్ని వ్యర్థాలు వదలేయడంతో కలుషితంగా మారింది. డ్రెయిన్ ఆనుకుని పుట్టగొడుగుల్లా ఆక్వా పరిశ్రమలు ఏర్పాటు చేయడంతో కలుషిత నీటితో దుర్వాసన వెదజల్లుతుంది. దీంతో యనమదుర్రు డ్రెయిన్ నుంచి ముక్కుపుటలు బద్దలయ్యేలా దుర్వాసన రావడంతో ముక్కుమూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. మండలంలో యనమదుర్రు, దిరుసుమర్రు, దెయ్యాలతిప్ప, గొల్లవానితిప్ప, తోకతిప్ప, లోసరి, నాగిడి పాలెం తదితర గ్రామాలు ఈ డ్రెయిన్‌కు ఆనుకుని ఉన్నాయి. ఆయా గ్రామాల్లో సుమారు 30 వేల మంది జనాభా వరకు నివసిస్తున్నారు. యనమదుర్రు డ్రెయిన్ దుర్గంధం వల్ల పరివాహక గ్రామస్తులు తరచూ అనారోగ్యానికి గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో వేలాది రూపాయలు ఆస్పత్రుల పాలు చేస్తున్నామని వాపోతున్నారు.

పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ఆక్వా పరిశ్రమలు

యనమదుర్రు డ్రెయిన్ ఎగువన పేపర్ మిల్లులు, రొయ్య తలకాయల ఫ్యాక్టరీలు, ఆక్వా పరిశ్రమలు ద్వారా విడుదలయ్యిన రసాయనాలతో యనమదుర్రు డ్రెయిన్ కలుషితమైంది. ఇది చాలదన్నట్లు ఎగువన భీమవరం పట్టణంలోని చెత్త, చెదారం, సెప్టిక్ ట్యాంకులు, డ్రెయినేజీ నీటిని ఈ డ్రెయిన్‌లోనే విడుదల చేస్తున్నారు. దీంతో పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాల్లోని పలు డ్రెయిన్‌లు రసాయనాలతో కలుషితమైపోతున్నాయి. దీంతో ఆ కాలువల్లో ఉన్న అపారమైన మత్స్య సంపద దెబ్బతినడంతో వేలాది మత్స్యకారులు రోడ్డున పడుతున్నారు. రోజుకొకటి పుట్టగొడుగుల్లా డ్రెయిన్ పరివాహక ప్రాంతంలో ఆక్వా పరిశ్రమలు, రొయ్యలు షెడ్లు ఏర్పాటు చేయడంతో వాటి నుంచి విడుదలయ్యే కలుషితనీరు డ్రెయిన్‌లోనే వదులుతున్నారు.

డ్రెయిన్ శుద్ధి ఎప్పుడో..!

గత టీడీపీ ప్రభుత్వంలో యనమదుర్రు డ్రెయిన్‌ను రూ.100 కోట్లతో ప్రక్షాళన చేస్తామని సభలు, సమావేశాలలో ప్రజాప్రతినిధులు బల్లగుద్ది చెప్పినప్పటికీ ఆవేమి క్షేత్రస్థాయిలో జరగలేదు. డ్రెయిన్ నుంచి దుర్వాసన రావడంతో తీర ప్రాంత గ్రామాలైన నాగిడిపాలెం, దెయ్యాలతిప్ప, గూట్లపాడు, తోకతిప్ప, ఐరువానిపేట, గొల్లవానితిప్ప దిరుసుమర్రు, యనమదుర్రు గ్రామాల ప్రజలు తరచూ అనారోగ్యానికి గురవుతున్నామని వేలాది రూపాయలు ఆస్పత్రులకే ఖర్చు చేస్తున్నామని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి యనమదుర్రు డ్రెయిన్‌లోకి కలుషితమైన నీటిని విడుదల చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పరివాహక గ్రామస్తులు కోరుతున్నారు.

పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

వివిధ పరిశ్రమలకు చెందిన వారు యనమదుర్రు డ్రెయిన్‌లో కలుషితమైన నీటిని వదులుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని యనమదుర్రు పరివాహక గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు పరిశ్రమల లబ్ధి కోసం వేలాది మంది జీవితాలు బలవ్వాలా అని ప్రశ్నిస్తున్నారు.

తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నాం

డ్రెయిన్ నుంచి వెలువడే దుర్గంధం వల్ల తరచూ చిన్నపిల్లలు నుంచి వద్ధులు వరకు అనారోగ్యానికి గురవుతున్నాం. అంతేకాకుండా దోమలు ప్రబలి రాత్రులు కంటి మీద కునుకు పట్టడం లేదు. చాలామంది 50–60 ఏళ్ల మధ్య వృద్ధులు ఊపిరితిత్తుల వ్యాధులతో చనిపోతున్నారు. నెలకు వేలాది రూపాయలు ఆస్పత్రులకే ఖర్చు పెట్టాల్సి వస్తుంది.

– ఎస్.నెలబాలుడు, గ్రామస్తుడు, నాగిడిపాలెం

మా పరిస్థితి దేవుడికే ఎరుక

చుట్టూ ఎక్కడ చూసిన ఉప్పునీరే దర్శనమిస్తుంది. దీంతో పక్కనే ఉన్న డ్రెయిన్‌లో ఉన్న నీటిలోనే స్నానం చేయాల్సిన దుస్థితి పట్టింది. అంతేకాకుండా వేసవిలో బట్టలు, వాడుకోవడానికి కూడా ఈ నీటినే వాడుకుంటున్నాం. మా పరిస్థితి దేవుడికే ఎరుక.

– టి.శ్రీనివాస్, గ్రామస్తుడు, తోకతిప్ప

250 మందికి ఆహార పొట్లాల పంపిణీ



ఆహార పొట్లాలు అందజేస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): పేదల ఆకలిని తీర్చేందుకు హంగర్ ఫ్రీ వరల్డ్ అంటూ మలబార్ గోల్డ్ చేస్తున్న సేవలు అద్వితీయమని ఉద్దరాజు ఆనందరాజు ఫౌండేషన్ చైర్మన్ ఉద్దరాజు కాశీ విశ్వనాథరాజు, సూర్యమిత్ర ఎగ్జిమ్ ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్ యిర్రింకి సూర్యారావు అన్నారు. వరల్డ్ హంగర్ డే సందర్భంగా ఆకలి-రహిత ప్రపంచం సాధన దిశగా మలబార్ గోల్డ్ హంగర్ ఫ్రీ వరల్డ్ ప్రోగ్రామ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా భీమవరంలో 250 మందికి ఉచిత ఆహార పొట్లాలను అందజేశారు. భీమవరం షోరూం హెడ్ ఇంథియాస్ మాట్లాడుతూ 16 రాష్ట్రాల్లోని 70 నగరాల్లో మలబార్ గోల్డ్ ఈ కార్యక్రమాన్ని చేపడుతోందని తెలిపారు. అనంతరం ఇందిరమ్మ కాలనీ పలు ఆశ్రమంలోని వృద్ధులకు ఆహార ప్యాకెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో కంతేటి వెంకటరాజు, చెరుకువాడ రంగసాయి, దాయన చంద్రజీ, అల్లు శ్రీనివాస్, నరసింహ, కృష్ణ, షోరూమ్ సిబ్బంది పాల్గొన్నారు.

3 నుంచి సువార్త సభలు

ఉండి: ఉండి శివారు ఉప్పుగుంట సెయింట్‌పాల్స్ లూథరన్ చర్చ్ ఆధ్వర్యంలో జూన్ నెల 3వ నుంచి 5వ తేదీ బుధవారం వరకు రక్షణ సువార్త సభలు నిర్వహిస్తున్నట్లు సంఘ ప్రతినిధులు తెలిపారు. ఉదయం సభ 10 గంటలకు, సాయంత్రం సభ 6 గంటలకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పేరిషపాస్టర్ రెవరెండ్ బీ డేవిగ్‌లివింగ్‌స్టన్ ఈ సభలను ప్రారంభిస్తారని రెవరెండ్ యం జోసఫ్ (చేబ్రోలు),పాస్టర్ కే జార్జ్‌బుష్(మచిలీపట్నం),బ్రదర్ కే జాన్‌మంగాచార్యులు (పెదలంక),బ్రదర్,ఎస్ ఎనోష్‌రాజు(విశాఖపట్నం)నుంచి వాక్యోపదేశం చేసేందుకు వస్తున్నట్లు తెలిపారు. దేవుని బిడ్డలంతా ఈ సభల్లో పాల్గొనాలని వారు కోరారు.

కౌంటింగ్ కేంద్రంలో నిబంధనలు పాటించాలి

- అనుమతి ఉన్నవారికే ప్రవేశం
- జిల్లా జాయింట్ కలెక్టర్ సీవీ ప్రవీణ్ ఆదిత్య



మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి, జేసీ ప్రవీణ్ ఆదిత్య

ఉండి: ఓట్ల లెక్కింపు ప్రారంభం నుంచి పూర్తయ్యేంత వరకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా మెలగాలని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ సీవీ ప్రవీణ్‌ఆదిత్య అన్నారు. మంగళవారం ఉండి ఎంపీడీవో కార్యాలయంలో నియోజకవర్గంలోని ఆయా పార్టీల అభ్యర్థులు, కౌటింగ్ ఏజెంట్లు, అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని కౌటింగ్ ప్రక్రియకు సంబంధించి ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.కౌటింగ్ సజావుగా సాగేలా పోటీ చేసిన అభ్యర్థులు, ఏజెంట్లు తమ సహకారాన్ని అందించాలని తెలిపారు. ఎన్నికల సమయంలో నియోజకవర్గ వ్యాప్తంగా అందించిన సహకారాన్ని కౌటింగ్ సమయంలోను అందించాలని కోరారు. కౌంటింగ్‌కు వచ్చేవారంతా తప్పనిసరిగా తమ పాస్‌లు తీసుకుని ఉదయం 6 గంటలకు కౌటింగ్ కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. కౌటింగ్ కేంద్రంలోకి సెల్‌ఫోన్‌లు తీసుకెళ్ళేందుకు ఎవ్వరికీ అనుమతి లేదని సంబంధిత కౌంటర్‌లో డిపాజిట్ చేసిన తర్వాతనే లోనికి వెళ్లాలన్నారు. కౌటింగ్ కేంద్రంలోనికి ప్రవేశించే వారందరికీ అవసరమైన తనిఖీలు చేపట్టిన అనంతరం లోనికి అనుమతించడం జరుగుతుందని అన్నారు. ఎమ్మెల్యే, ఎంపీ స్థానాలకు వేరువేరుగా కౌటింగ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. అసెంబ్లీకి 14 టేబుల్స్, ఎంపీకి 14 టేబుల్స్, పోస్టల్ బ్యాలెట్ ఓట్లు కొరకు 4 టేబుల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.4వ తేదీ ఉదయం 8 గంటలకు కౌటింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. కౌంటింగ్ ఏజెంట్ల నియామక ప్రక్రియను ఈ నెల 31వ తేదీ లోపుగా పూర్తి చేయాలని సూచించారు. కౌంటింగ్ సమయంలో శాంతి భద్రతల పరిరక్షణకు కేంద్ర సాయుధ బలగాలు, పోలీసులతో పరిరక్షణ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కౌంటింగ్ ప్రక్రియపై ఎన్నికల సంఘం నూతనంగా వెలువరించిన నిబంధనలను ఆర్‌ఓ ఈ సందర్భంగా వివరించారు. అనంతరం భీమవరం ఎస్ఆర్‌కేఆర్ కళాశాలలో అధికారులకు కౌంటింగ్ పై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. కౌటింగ్ ప్రక్రియ సజావుగా సాగేలా అధికారులంతా సన్నద్ధంగా ఉండాలని ఆర్‌ఓ ప్రవీణ్‌ఆదిత్య సూచించారు. స్ట్రాంగ్ రూమ్‌లను ఏజెంట్ల సమక్షంలోనే తెరవాలని అన్నారు. డ్రెస్‌కోడ్ ఉన్న హమాలీలు మాత్రమే స్ట్రాంగ్ రూమ్ నుంచి ఈవీఎంలను తెస్తారని తెలిపారు. అన్ని వివరాలు సరిపోల్చిన తరువాతనే ఓట్ల లెక్కింపు ప్రారంభించాలని అన్నారు. ఏదైనా తేడా వస్తే వెంటనే రిటర్నింగ్ అధికారిని సంప్రదించాలన్నారు. కౌటింగ్ ఏజెంట్లకు రిజల్ట్ చూపించిన అనంతరం నిర్దేశించిన నమూనాలో నమోదు చేయాలన్నారు.14 టేబుల్స్ వద్ద ఒక రౌండ్ పూర్తయిన అనంతరం రౌండ్ ప్రారంభించాలని అన్నారు. వీవీ ప్యాడ్స్ స్లిప్పుల లెక్కింపు గోప్యంగా చేయాలన్నారు. అనంతరం వాటిని రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో బ్లాక్ కలర్ కవర్‌లో భద్రపరచాలన్నారు. కౌంటింగ్ ప్రక్రియ మొత్తం వీడియోగ్రఫీ చేయాలని సూచించారు. అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి కే శ్రీనివాస్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఏజెంట్లు, అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు యోగాపై శిక్షణ



వేల్పూరు గ్రంథాలయంలో యోగా చేస్తున్న విద్యార్థులు



అత్తిలి శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు యోగాపై శిక్షణ ఇస్తున్న దృశ్యం

తణుకు టౌన్: విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులలో భాగంగా తణుకు రూరల్ మండలం వేల్పూరు గ్రామంలోని శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు వివిధ అంశాలపై శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు పుస్తక పఠనం, పుస్తక సమీక్ష, నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు పుస్తక పఠనంపై ఆసక్తి కలిగించే వివిధ అంశాలను రీసోర్సు పర్సన్‌లు వివరించారు. ఈకార్యక్రమంలో రిటైర్డ్ ఎంఈవో కే సత్యనారాయణ, వైఎస్ఎన్ వసంతరావు, బసవేశ్వరరావు, గ్రంథాలయ అధికారి సాయిబాబా పాల్గొన్నారు.

అత్తిలి: వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులలో భాగంగా అత్తిలి శాఖా గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులతో నీతి కథలు చదివించి, జాతీయ గీతాలను పాడించారు. అనంతరం రిసోర్సుపర్సన్ కె కోమలి యోగాపై శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే యోగ శిక్షణ ఇవ్వడం ద్వారా విద్యార్థులకు ఆత్మస్థైర్యం పెంపొందిస్తుందని, అందుకు అనుగుణంగా మేథాశక్తి పెరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పి శ్రీనివాసరెడ్డి, వలంటీర్ వి రమేష్, గ్రంథాలయాధికారి డి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

రుతుక్రమంపై అపోహలు విడనాడాలి



దొడ్డనపూడి అంగన్‌వాడీ కేంద్రంలో సూచనలు చేస్తున్న వైద్యులు సునీల్

కాళ్ల: ప్రభుత్వ వైద్య సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కాళ్ల ప్రభుత్వాసుపత్రి వైద్యులు ఎస్. సునీల్ తెలిపారు. కాళ్ల మండలం దొడ్డనపూడి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం వద్ద రుతుక్రమ పరిశుభ్రత దినోత్సవన్ని మంగళవారం కాళ్ల ప్రభుత్వాసుపత్రి వైద్యులు సునీల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి, అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సునీల్ మాట్లాడుతూ రుతుక్రమం అనేది సాధారణమైన ప్రక్రియ అన్నారు. దీనిపై ఎటువంటి అపోహలు లేకుండా రోజువారీ పనులు చేసుకోవచ్చన్నారు. రుతుక్రమం సమయంలో వ్యక్తిగత పరిశుభ్రత చాలా అవసరం అన్నారు. పరిసరాల పరిశుభ్రతపై దృష్టిపెట్టాలన్నారు. మహిళలు రుతుక్రమం సమయంలో శానిటరీ నాప్కిన్స్ వాడాలన్నారు. వైద్యాధికారులు విజయావతి, చండీరాణి, పాల్సన్, సుబ్బలక్ష్మి, ఎంపీ ఈహెచ్వోలు, ఏఎన్ఎంలు అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

పాలకొల్లు సెంట్రల్: కౌంటింగ్ తరువాత ఎన్నికల కోడ్ ముగిసే వరకూ విజయోత్సవ ర్యాలీలు నిర్వహించరాదని, శాంతి భద్రతలకు విఘాతం కలిగించకూడదని ఆర్వో బీఎస్ నారాయణరెడ్డి సూచించారు. మునిసిపల్ కార్యాలయం ఆర్వో ఛాంబర్‌లో పార్టీల నాయకులతో కౌంటింగ్ అంశాలపై సూచనలు చేశారు. కౌంటింగ్ వద్ద స్టేట్ పోలీస్, స్పెషల్ బెటాలియన్, సీఏపీఎఫ్ వంటి మూడంచెల తనిఖీ ఉంటుందన్నారు.

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం

పెనుమంట్ర: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరం ముగింపు సమావేశం మార్టేరు వేణుగోపాల ఆడిటోరియంలో మండల అధ్యక్షుడు బాణాల శ్రీనివాసరావు నిర్వహించారు. శిక్షణలో యోగ, కుంగ్‌ఫూ, కరాటే, గీతా శ్లోకాలు, కూచిపూడి, సంగీతం, కోలాటాలలో 190 మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చి, బహుమతులు అందజేశారు.

ఆరోగ్య పరిరక్షణపై శ్రద్ధ చూపాలి



కార్యక్రమంలో అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

పాలకోడేరు: మహిళలు, యువతులు తన ఆరోగ్య పరిరక్షణ పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని పాలకోడేరు పీహెచ్‌సీ వైద్యాధికారి సీహెచ్ రంగమనాయుడు తెలిపారు. మంగళవారం విస్సాకోడేరు లోని ఫోర్ నంబర్‌పేటలో గల అంగన్‌వాడీ కేంద్రంలో మహిళలు, యువతులు, కిషోర్ బాలికలకు వ్యక్తిగత పరిశుభ్రతపై మాసిక మహోత్సవ వారోత్సవాల ముగింపును పురస్కరించుకుని మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రంగమనాయుడు మాట్లాడుతూ మాట్లాడుతూ మహిళ ఆరోగ్యమే కుటుంబ ఆరోగ్యమన్నారు. రుతుక్రమం తరుణంలో నిషేధిత ఉత్పత్తులను మహిళలు వినియోగించడం వల్ల అనేక అనర్థాలు సంభవిస్తున్నట్టు చెప్పారు. ఎక్కువగా క్యాన్సర్ బారిన పడుతున్నట్టు గణాంకాలు చెబుతున్నాయని తెలిపారు. రుతుక్రమంలో 11 నుంచి 18 ఏళ్లలోపు కిషోర్‌బాలికలు, 45 ఏళ్ల దాటిన మహిళలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, వాటిని అడ్డుకోవాల్సిన బాధ్యత కమిటీలపై ఉందని అన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై బాలికలకు, తల్లులు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నరు.

కుక్కలున్నాయి.. పిక్కలు జాగ్రత్త..!

- వెంటపడి దాడి చేస్తున్న కుక్కలు
- గగ్గోలు పెడుతున్న జనం



తణుకులో గుంపులుగా సంచరిస్తున్న శునకాలు

తణుకు: అడ్డూ.. అదుపు లేకుండా సంచరిస్తున్న శునకాలతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. పట్టపగలే ప్రజలు చుక్కలు చూస్తున్నారు. గ్రామ సింహాలు ప్రతి వీధిలో తిరుగుతూ రచ్చ రచ్చ చేస్తున్నాయి. కుక్కలతో పాటు పిల్లులు, కోతులు, ఎలుకలు కరిచినా ర్యాబిస్ వస్తుంది. మిగిలిన వాటితో పెద్దగా సమస్య లేకపోయినా కుక్కలు మాత్రం గుంపులు గుంపులుగా తిరుగుతూ ప్రజలపై దాడి చేస్తున్నాయి. తణుకు పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో కుక్కల వల్ల ప్రజలకు, పొలాల్లోని పశువులకు రక్షణ కరువైందని పలువురు వాపోతున్నారు. శునకాల నియంత్రణకు తణుకు మునిసిపల్ అధికారులు చర్యలు తణుకులో చేపట్టినప్పటికీ పూర్తిస్థాయిలో సత్ఫలితాలు ఇవ్వకపోవడం విమర్శలకు తావిస్తోంది. గతంలో వానరాల గుంపుపై దాడి చేసిన శునకాలు ఒక కోతిని అమానుషంగా కరిచి చంపేసిన ఘటన కలచివేసింది.

హడలెత్తిపోతున్న జనం...

తణుకు పట్టణంతో పాటు నియోజకవర్గంలోని తణుకు, అత్తిలి, ఇరగవరం మండలాల్లో ఎక్కడ చూసినా కుక్కల బెడద ఎక్కువగా ఉంది. ఆయా గ్రామాల్లో గుంపులు, గుంపులుగా శునకాలు తిరుగుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో అయితే కోళ్లు, పశువులపైనా దాడి చేస్తున్నాయి. వీధి కుక్కలతో పాటు ఒక్కోసారి పెంపుడు కుక్కలు సైతం దాడులకు పాల్పడుతున్నాయి. ప్రజల ప్రాణాలు తోడేస్తున్న కుక్కలను నియంత్రించడంలో అటు మునిసిపల్ ఇటు పంచాయతీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తుండంతో ప్రజల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కుక్కలు ఎక్కడ మీద పడి దాడి చేస్తాయోనని బయటకు వెళ్లేందుకు మహిళలు, వృద్ధులు భయపడుతున్నారు. శునకాలు గ్రామీణ ప్రాంతాల్లో లేగదూడలు, పశువులు, కోళ్లు, మేకలపైనా దాడి చేసి గాయపర్చుతున్నాయని రైతులు వాపోతున్నారు.

చర్యలేవీ..?

తణుకు పట్టణంతో పాటు నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నా సంబంధిత అధికారులు మాత్రం పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. పట్టణంలో పెరుగుతున్న కుక్కల సంతతిని నియంత్రించడానికి గతంలో మునిసిపల్ అధికారులు బర్త్ కంట్రోల్ (కుటుంబ నియంత్రణ) విధానం అమలు చేశారు. ప్రైవేట్, స్వచ్ఛంద సంస్థ సహకారంతో తణుకు మునిసిపల్ పరిధిలో ప్రయోగాత్మకంగా చేపట్టిన ఈ విధానంలో 104 కుక్కలకు కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు చేశారు. ఒకవేళ కరిచినా ప్రమాదం లేకుండా వ్యాక్సినేషన్ సైతం చేశారు. సాధారణంగా వర్షాకాలం ఆరంభంలో కుక్కలకు పిచ్చిపడుతుంటుంది. ఈ క్రమంలో అవి మనుషులను కరిచిన తర్వాత సకాలంలో వ్యాక్సిన్ వేయక పోతే మనిషికి పిచ్చి పట్టి మరణిస్తాడు. వైద్య అధికారులు, పంచాయతీ అధికారులు కుక్కల బెడదను తగ్గించడంతో పాటు వ్యాక్సిన్లు అందుబాటులో ఉంచాలని పలువురు కోరుతున్నారు.

బాలికలు శుభ్రత పాటించాలి

తాడేపల్లిగూడెం రూరల్: బాపరిశుభ్రతతోనే ఆరోగ్యకరమైన జీవితం లభిస్తుందని వెంకట్రామన్నగూడెం పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీహర్ష అన్నారు. మంగళవారం మండలంలోని వెంకట్రామన్నగూడెం గ్రామంలో మహిళలు, యువతులు, కిషోర్ బాలికలకు వ్యక్తిగత పరిశుభ్రతపై మాసిక మహోత్సవ వారోత్సవాల పురస్కరించుకుని ర్యాలీ, అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీహర్ష మాట్లాడుతూ మహిళ ఆరోగ్యమే కుటుంబ ఆరోగ్యమన్నారు. రుతుక్రమం తరుణంలో నిషేధిత ఉత్పత్తులను మహిళలు వినియోగించడం వల్ల అనేక అనర్థాలు సంభవిస్తున్నట్టు చెప్పారు. 11 నుంచి 18 ఏళ్లలోపు కిషోర్‌బాలికలు, 45 ఏళ్ల దాటిన మహిళలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. సీహెచ్‌వో సూర్యకాంతం, హెచ్‌వీ జ్యోతి, హెచ్ఎస్ లక్ష్మణరావు, సిబ్బంది పాల్గొన్నారు.